కథ

# “అసత్యమేవ జయతే”

◆ ధర్మచక్ర ◆

సరిగ్గా ఉదయం పదిగంటలు.

లకడీకాపూల్ న్యూ డి.జి.పి. కాంప్లెక్స్‌లో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ జరుగుతోంది.

అందుకే యువకులతో హాలంతా నిండిపోయి వుంది. కొందరు యువకులు అక్కడవున్న పోలీసులను అడిగి సందేహాలను తీర్చుకుంటున్నారు.

కొంతమంది పోలీసులు పనిలేక పోయినా క్షణం తీరికలేనట్టు అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఇంటర్వ్యూ మొదలయింది.

యువకుల్లో లోపల పోలీసు అధికారులు అడిగే ప్రశ్నలను ముందుగా తెలుసుకోవాలంటే ఉత్కంఠ మొదలయింది.

కొందరు బోర్డు అధికారుల పేర్లు తెలుసుకుంటున్నారు. మరికొందరు పైరవీలు, పచ్చనోట్లు ఉండగా తమకు ఉద్యోగం వస్తుందనే ఆశ వదులుకుంటున్నారు.

దూరంగా కూర్చొని వున్న యువకుడు వేసుకున్న బట్టలు అందంగా లేకపోయినా మంచి శారీరక ధారుఢ్యంతో హుందాగా కనిపిస్తున్నాడు.

కాని ఎందుకో నిరుత్సాహం, నిస్పృహ అతనిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

అతనికిది ఆఖరి ఇంటర్వ్యూ. మరోసారి ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకోవాలంటే అతని వయస్సు అందుకు అడ్డుతగులుతుంది.

ఇన్నేళ్ళు కన్నవారిపై పరాన్నజీవిగా బ్రతికాడు. దానికితోడు నిరుద్యోగం దీర్ఘరోగంలా పీడిస్తోంది.

అందుకే ఆలోచనల్లో తిరుగుతున్నాడు.

“అన్నయ్యా! నిన్ను పోలీస్ ఆఫీసర్‌గా చూడాలని వుంది. ఆ డ్రస్‌లో నువ్వెంత బాగుంటావో... నీకు పోలీస్ ఆఫీసర్ ఉద్యోగం వచ్చిందని నా ఫ్రెండ్స్ అందరితో చెప్తాను” ఇంటర్వ్యూకి ముస్తాబవుతున్న శ్రీధర్‌తో చెప్పింది చెల్లెలు.

షర్ట్ బటన్ పెట్టుకుంటూ తలఎత్తి చెల్లెలు వంక చూశాడు ఆ చూపులో ఉద్యోగం వస్తుందనే ఆశ లేదనే భావం, ఆమె పట్ల అన్నయ్యగా తన బాధ్యత గుర్తొచ్చింది.

“ఒరేయ్ శ్రీధర్ దేవుని దయవల్ల నీకు ఉద్యోగం వస్తే తిరుపతికి నడిచొస్తానని మొక్కుకున్నాను” అప్పుడే పూజచేసి తెచ్చిన కుంకుమతో తిలకం దిద్దుతూ చెప్పింది తల్లి.

“ఈరోజుల్లో ఉద్యోగం రావడం అంటే మాటలు కాదు అన్నీ ఉండాలి. నాకృషి నేను చేస్తానమ్మా” ప్రసాదం తీసుకుంటూ చెప్పాడు శ్రీధర్.

“ఏరా... నీ ఉద్యోగం విషయం ఏమయింది... ఇంటర్వ్యూకి బయలుదేరుతున్నావా? అయినా నువ్వు పోలీసు ఉద్యోగానికి పనికిరావురా... నీ మనస్తత్వానికి అది సరిపడదురా... నువ్వు పోలీసు ఉద్యోగంలో చేరడం నాకెంతమాత్రం ఇష్టంలేదు” పేపరు చదువుకుంటూనే తన అభిప్రాయం చెప్పాడు తండ్రి.

“ఆయన మాటలు నీవేమీ పట్టించుకోకురా బాబు” ఇంటర్వ్యూకి వెళుతున్న కొడుక్కి స్వయంగా ఎదురొచ్చి సాగనంపింది తల్లి.

ఆత్మ విశ్వాసమే అతనిని ఆఖరి ఇంటర్వ్యూకి లాక్కొని వచ్చింది. ఇంటర్వ్యూలో తన పేరు రానే వచ్చింది.

ఇంటర్వ్యూ పూర్తయింది.

లోపలికి వెళ్ళేటప్పుడు ఉన్నంత ఉత్సాహం బయటకు వచ్చేటప్పుడు కనిపించడంలేదు. భారంగా అడుగులు వేస్తూ బయటకు నడిచాడు.

ఆ సమయంలో శ్రీధర్‌కి ఉద్యోగం వస్తుందనే ఆశ పోయింది. తనను ఇంటర్వ్యూ డ్రిల్ చేయించిన పోలీసు అధికారులను నిలదీసి అడగాలనిపించింది. మనసులో తిట్టుకున్నాడు. తనలో ఆవేశాన్ని అణచుకున్నాడు.

పత్రికలు ప్రతిరోజు పోలీసుశాఖ అసమర్థతను పనిగట్టుకుని ఎందుకు ప్రచురిస్తాయో ఇప్పుడు అర్థమయింది శ్రీధర్‌కి.

బస్‌స్టాప్ చేరుకున్నాడు.

ఎన్ని బస్సులు వచ్చినా తను వెళ్ళాల్సిన బస్సు రావడం లేదు. అవసరం లేనపుడు కావలిసిన బస్సులు వెంటవెంటనే వస్తాయి. అవసరానికి ఒక్కటీ రాదు... ఏమిటో మనసులోనే అనుకున్నాడు.

అప్పుడే కాలేజీ వదలినట్టుంది.

గుంపులు, గుంపులుగా విద్యార్థులు బస్‌స్టాప్ చేరుకుంటున్నారు. కొందరు అమ్మాయిలు ఇంటి దగ్గర

• • •

ఇన్నేళ్ళు కన్నవారిపై పరాన్నజీవిగా బ్రతికాడు.

• • •

చాలవన్నట్టు ముచ్చట్లలో పడ్డారు. అబ్బాయిలు జోక్స్ వేసుకుంటూ నవ్వుకుంటున్నారు. కొందరు ఫుట్ బోర్డ్‌పై వ్రేలాడుతూ కొంపలు మునిగిపోతున్నట్టు ప్రయాణిస్తున్నారు.

సరిగ్గా అప్పుడే శ్రీధర్ దృష్టి ప్రక్కకు మళ్లింది. అక్కడ ఒక అమ్మాయి, అబ్బాయిల పెనుగులాట మొదలయింది.

చూసే వాళ్లంతా అదేదో ప్రేమ వ్యవహారమని పెదవి విరుస్తున్నారు.

కొందరు గుడ్లప్పగించి చూస్తున్నారు. కొందరు భయంతో అక్కడేదో జరగబోతోందని చెల్లాచెదరవుతున్నారు.

ధైర్యం వీర్యం లేని నపుంసకులైన యువకులు, అభినవ సినిమా హీరోలు పరిగెడుతున్నారు. ఆక్షణంలో శ్రీధర్ కి ఏమీ తట్టలేదు. తను పారిపోవాలనుకున్నాడు వేగంగా అంగలు వేస్తున్నాడు.

అప్పటికే ఆ అమ్మాయి చెస్ట్‌లో కత్తి దిగింది. రక్తం చిమ్ముతోంది.

రక్షణ కోరుతూ ఆ అమ్మాయి చేసే ఆక్రందనతో ఆ ప్రాంతమంతా భూకంపంలా మారింది.

రక్తపు మడుగులో ఆ అమ్మాయి లేడిపిల్లలా కొట్టుకుంటోంది.

కొన్ని దుకాణాలు అనుకోకుండా షట్టర్లు మూసుకుంటున్నాయి.

శ్రీధర్ కొంత దూరం పరుగుతీశాడు. కాని ఆ

●●●

## రక్తపు మడుగులో ఆ అమ్మాయి లేడి పిల్లలా కొట్టుకుంటోంది.

●●●

అమ్మాయి ఆక్రందన విద్యుత్ తరంగంలా ప్రయాణించి అతనిలోని నైతిక బాధ్యతకు ప్రేరణ కలిగించింది.

శ్రీధర్ ఏమి చెయ్యబోతున్నాడో అతనికే తెలియడం లేదు. వెనక్కి పరుగుతీసి ఆ అమ్మాయిని చేరుకున్నాడు.

క్షణంలో రెండో పోటు పొడవబోయిన యువకుడి చేతిని మెరుపులా అడ్డుకున్నాడు.

ఒక్క క్షణం పెనుగులాట వాళ్ళ మధ్య.

అనుకోని సంఘటనకు రెండవ యువకుడు శ్రీధర్ మెడను విరిచి పట్టుకున్నాడు.

శక్తినంతా కూడగట్టుకొని శ్రీధర్ బలంగా మోకాలుతో వాడి ఆయువుపట్టుపై తన్నాడు. శబ్దం చెయ్యకుండా ఆ యువకుడు పడిపోయాడు.

తను పట్టుకున్న చేతిని వదలకుండా రెండవచేత్తో మూడవ యువకుడి రిబ్స్‌పై గుద్దాడు.

మూడవ వాడు మూలుగుతూ క్రిందపడిపోయాడు. ఆవేశంతో ఊగిపోతూ మూడవవాడు పెద్దరాయి పైకిఎత్తి విసిరాడు. అది శ్రీధర్ భుజాన్ని తాకి గాయం చేసింది.

బాధను దిగమింగుకుంటూ మూడో వాడ్ని దొరకబుచ్చుకుని వాడ్ని ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టాడు.





# వృత్తే ముఖ్యం!

'నాకు వృత్తి అంటే ఎంతో గౌరవం. మూడు నాలుగు నెలలు పనిచేస్తే చాలు, నాకు కొంత విశ్రాంతి అవసరం అనిపిస్తుంది. రెండు మూడు రోజులు విశ్రాంతి తీసుకొంటే చాలు, మళ్ళీ వృత్తిలోకి వెళ్ళిపోవాలన్న దిగులు మొదలవుతుంది. నేను పరిశ్రమలోకి వచ్చినప్పుడు అంతా నన్ను మాధురీ దీక్షిత్‌లా ఉన్నావని అన్నారు. కానీ ప్రస్తుతం అందరూ నన్ను నన్నుగా గుర్తిస్తున్నారు.

—మనీషా కోయిరాలా

ఇక లాభం లేదనుకొని, పోలీసు రావచ్చని ఆ యువకులు తిట్టుకుంటూ జారుకున్నారు.

అప్పటికే ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. సహాయం కోసం ఎవరూ రారని తెలిసి ఆ అమ్మాయిని భుజాన వేసుకొని ఆసుపత్రి వైపు వేగంగా నడుస్తున్నాడు శ్రీధర్. సరిగ్గా అప్పుడే.

రయ్ మంటూ మహీంద్రాజీప్ ఒకటి ముందుకు వచ్చి ఆగింది. జీప్‌కి నంబర్ లేదు. అప్పుడప్పుడు పోలీసులు నెంబర్ లేని జీప్‌లో వస్తారని, ఎక్కడ పడితే అక్కడ అరెస్టు చెయ్యడం వారికి అలవాటు అని శ్రీధర్‌కి తెలియదు.

ఆ అమ్మాయి తాలుకు మనుషులేమోనని ఆగాడు. జీపులో పోలీసులు అందరి చేతుల్లో తుపాకులున్నాయి. ముందు సీట్లో నుండి "ఆగరా"... అంటూ ఒక వ్యక్తి కాలు క్రింద పెట్టాడు.

భుజాన వున్న నక్షత్రాల సంఖ్యనుబట్టి అతను ఇన్‌స్పెక్టర్ అని గుర్తుపట్టాడు శ్రీధర్.

"ఎవ్వడ్రా నువ్వు ఈ అమ్మాయిని ఏం చేశావ్?" పొడిచింది నువ్వేనా?" పోలీసు లాంగ్వేజిలో అడిగాడు.

"లేదు సార్ ఎవరో ముగ్గురు అబ్బాయిలు ఈ అమ్మాయిని చంపుతుంటే... అడ్డు వెళ్ళాము" బరువు మోస్తున్నవాడిలా రొప్పుతూ చెప్పాడు శ్రీధర్.

"ఆహో... కథలు చెప్పకురా... ఈ అమ్మాయి నీకేమి కావాలి' నీవేమయినా సినిమా హీరోననుకున్నావంట్రా" గట్టిగా గద్దించారు పోలీసులు.

"సార్ ఆలస్యం చేస్తే ఈ అమ్మాయి చనిపోతుంది ముందు ఆసుపత్రికి తీసుకెళదాం" ప్రాధేయపడుతూ చెప్పాడు శ్రీధర్.

మాకే ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తావ్‌రా లం.... అంటూ చొక్కా పట్టుకొని లాగాడు సి.ఐ.

శ్రీధర్ అమ్మాయిని నేలపై పడుకోబెట్టాడు.

ఆ సమయంలో పోలీసులు ఏమి చెప్పినా వినే స్థితిలో లేరు.

అవును ఆ సమయంలో పోలీసులకు ఏమి చెప్పినా, వినపడదు, కనపడదు. ఏ కేసులో ఎంత డబ్బు వస్తుందో ఏ కేసులో డబ్బురాదో గుర్తించడం పోలీసులకు వెన్నతో పెట్టిన విద్య. అవసరమైతే కొత్త కేసులు పెట్టవచ్చు. అందుకు కొత్త రూల్స్ గుర్తురావచ్చు.

ఒక కానిస్టేబుల్ ఆ అమ్మాయిని ముట్టుకొని చూచి "సార్ ఈ అమ్మాయి చనిపోయింది" చెప్పాడు.

అయితే శవాన్ని పోస్టు మార్టం చేయించి, మార్చురిలో పెట్టించండి" తనతో వచ్చిన ఇద్దరు కానిస్టేబుల్స్‌తో చెప్పాడు సి.ఐ.

"యస్ సార్" అంటూ సెల్యూట్ చేశారు పోలీసులు.

శ్రీధర్‌ని జీప్ ఎక్కించారు పోలీసులు. కాళ్ళా వేళ్ళా పడ్డాడు శ్రీధర్. ఎంత చెప్పినా వినిపించుకోలేదు పోలీసులు.

జీపు పోలీస్ స్టేషన్ వైపు బయలుదేరింది.

సెల్‌లో 'ఇంటరాగేషన్' మొదలయింది.

"ఆ అమ్మాయి ఎవ్వరా?"

"తెలియదు సార్"

"చంపింది ఎవరు?"

"తెలియదు సార్"

"అయితే ఆ అమ్మాయిని చంపాల్సిన అవసరం?"

"తెలియదుసార్"

ఆ సమయంలో శ్రీధర్‌కి కట్ డ్రాయర్ తప్ప ఏమీ లేదు. శరీరం అక్కడక్కడ చిట్లి రక్తం కారుతోంది. అతనిపై పోలీసులు ఎన్ని రకాలైన డిగ్రీలున్నాయో ఇంటరాగేషన్‌లో అన్నీ ఉపయోగించారు.

అతని శరీరంపై మంటలు రేగుతున్నాయి.

కళ్ళలో కన్నీరు ఆవిరైపోతోంది.

నోరు ఎండిపోయి నాలుక పిడచగట్టింది.

శ్రీధర్ స్పృహ తప్పిపడిపోయాడు.

అప్పటికే ఎం.పి.కారు సి.ఐ. గారిని కుశలప్రశ్నలు వేశారు. పోలీస్ స్టేషన్ విషయాలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆ సర్కిల్‌లో నేరాల్ని అదుపులో పెడుతున్నందుకు ఫోన్‌లోనే సి.ఐ.గారిని అభినందించారు. అసలు విషయం బయటకు రాకూడదని ఎం.పి. గారే స్వయంగా చెప్పారు. పైగా సి.ఐ. గారిని విజిలెన్స్ సెల్‌కి ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నట్టు చెప్పారు.

కొన్ని నిమిషాలు ఫోన్స్ పలకరించుకున్నాయి.

కొన్ని డబ్బు కట్టలు మధ్య వ్యక్తిద్వారా చేతులు మారాయి.

ఎఫ్.ఐ.ఆర్ కొట్టి వేతలు లేకుండా వ్రాయబడింది.

సి.ఐ.గారి ముఖం వెయ్యి మెర్క్యూరీ బల్బుల కాంతితో వెలిగిపోతోంది.

సంతోషం ఆపుకోలేక సి.ఐ.గారు మందుపార్టీకి బయలుదేరాడు.

పొద్దు పోయాక పోలీసు స్టేషన్‌లో ఫోను ఆగకుండా మోగుతోంది.

అప్పటికే మందుపార్టీలో మజా చేసి వచ్చిన సి.ఐ. రిసీవర్ తీసుకొని "హల్లో సి.ఐ. సైఫాబాద్"

"నేను డి.ఐ.జి., సిబిసి.ఐ.డి. మాట్లాడుతున్నాను.

మా చిన్నమ్మాయి కాలేజీకి వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదు. ఫ్రెండ్స్ ఇంటికి వెళ్లిందనుకున్నాము. కన్‌ఫామ్ చేసుకుంటే వెళ్ళలేదని తెలిసింది. కాస్త ఎంక్వయిరీ చెయ్యండి".

"వాట్" సి.ఐ. గొంతు ఒక్కసారిగా.

సి.ఐ. పెదాలపై సిగరెట్ అసంకల్పితంగా జారిపోయింది.

డి.ఐ.జి. గారు కన్న కూతురు ఐడెంటిఫికేషన్స్ చెబుతున్నాడు ఫోన్‌లో.

ఇరాక్, ఇజ్రాయిల్ పై ప్రయోగించిన స్కడ్ మిసైల్ గురితప్పి తలపై పడినట్టు షాక్ తిన్నాడు సి.ఐ.

మరలా తేరుకుని వింటున్నాడు.

"అయితే... అయితే... అమ్మాయిగారు ఇకలేరు సార్" సి.ఐ. దుఃఖాన్ని నటిస్తూ.

"వాట్ దు యు మీన్".

"సారీ సర్ అమ్మాయిగారు హత్యచేయబడింది. డెడ్‌బాడీని మార్చురీలో ఉంచాము" తెలిపాడు సి.ఐ. విచారంగా.

"అయితే ఎవరు చంపారో తెలిసిందా?"

"యస్ సార్ హంతకుడ్ని ఎంతో చాకచక్యంగా పట్టుకొని సెల్‌లో పెట్టాం సార్. మీరు వచ్చి చూడొచ్చు" అంటున్న సి.ఐ. కళ్ళు వెతుక్కుంటూ సెల్‌లోకి వెళ్లి శ్రీధర్‌ని చూచి ఆగిపోయాడు.

కొడుకు పోలీసు అధికారిగా తిరిగొస్తాడని కళ్ళలో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారు తల్లీ, చెల్లెలు ఇంటిదగ్గర.